జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | 16 | మార్చి | 2025 ◆ పేజీలు : 4

## జిల్లాలో పర్యటించనున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్

- సంబంధిత శాఖ అధికారులు అందుబాటులో ఉండాలి
- బి రాహుల్ ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి.



**అశ్వారావుపేట, మార్చి 15, ప్రజాజ్యోతి:** ఈనెల 17, 18వ తేదీలు సోమ, మంగళవారాలలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ అశ్వారావుపేట మండలంలో పర్యటించనున్నారని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి .రాహుల్ శనివారం పత్రికలకు విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ కమిషన్ సభ్యులు సోమవారం ఉదయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చేరుకుంటారని, 17వ తేదీ సోమవారం చంద్రుగొండ మండలంలోని సీతాయిగూడెం

మిగతా 2 లో...




# వనం విడిచి జనంలోకి...

2 లో..

- కాలం చెల్లిన సిద్ధాంతాలకు స్వస్థి..
- సక్సెస్ అయిన ఆపరేషన్ చేయూత
- లొంగి పోయిన మావోయిస్టు సభ్యులకు ప్రభుత్వం చేయూత
- రూ. 25 వేల చొప్పన పారితోషికం అందజేత
- భద్రాద్రి జిల్లా పోలీసుల సేవలు భేష్..
- విలేకరుల సమావేశంలో మల్టీ జోన్ ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి



## నిర్లక్ష్యపు పోస్టల్ శాఖ

### చేరవలసిన వాటిని చెత్తలో వేశారు.

**చర్ల, మార్చి 15( ప్రజాజ్యోతి ):** ప్రపంచం టెక్నికల్ గా ఎంత ముందంజలో ఉన్నా కొన్ని కొన్ని సమాచారాలు అందజేయడంలో పోస్టల్ శాఖ ఖచ్చితంగా పనిచేయాల్సిందే, పోస్టల్ శాఖలో పలు రకాల సమాచారాలు కార్డుల ద్వారా, ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి చేరవేసే టటువంటి తరుణంలో ప్రజలకు వచ్చిన ఉత్తరాలను వారికి చేరవేయకుండా నెలల తరబడి తమ వద్దనే ఉంచుకొని ఆ తర్వాత ఎవరు చూడకుండా అడవిలో పడవేసిన దౌర్భాగ్యపు పరిస్థితి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో జరిగింది.ఆధార్ కార్డులు అప్డేట్ కోసం అనేకసార్లు మీ సేవ చుట్టూ తిరిగి, చివరకు అందుతాయని ఆశతో ఎదురుచూస్తున్న ప్రజలకు అడియాస లాగే మారిపోయింది. యువతకు ప్రభుత్వం నుండి కొన్నిసార్లు అందవలసిన అత్యంత విలువైన పత్రాలు సైతం మట్టి కొట్టుకుపోతున్నాయి, ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా జరగవలసినటువంటి సమాచారం పూర్తిస్థాయి ప్రజలకు చేతికందకుండానే అడవిలో ఆగమవుతున్నాయి ఇదంతా మన చర్ల మండల పరిధిలోని సత్యనారాయణపురం

మిగతా 2 లో...

## దొంగల హవా...

- చాకచక్యంతో వరుస దొంగతనాలు
- మండల ప్రజలను భయాందోళన గురి చేస్తున్న దొంగలు
- సితార రెస్టారెంట్లో అర్ధరాత్రి దోపిడీ.



**అశ్వాపురం, మార్చి 15 ప్రజాజ్యోతి:** అశ్వాపురం మండలంలో వరుస దొంగతనాలు ప్రజలు భయాందోళనలకు గురి చేస్తున్న దొంగలు గత కొన్ని రోజులుగా మండలంలో విరుచుకుపడుతున్న

మిగతా 2 లో...

## ఎన్నికల నిర్వహణ పై రాజకీయ పార్టీ నాయకులతో సమీక్ష

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.



**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 15, ప్రజాజ్యోతి :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శనివారం ఐడిఓసి కార్యాలయం సమావేశం మందిరంలో జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులతో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా రూపకల్పన, ఓటరు జాబితా సంబంధిత ఫారాలు 6,7 ,8 లపై రాజకీయ పార్టీ నాయకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించాలని, బూత్ లెవెల్ ఏజెంట్లు జాబితా పార్టీ జిల్లా ఇంచార్జ్ ధ్రువీకరణ చేసి అందించాలని కలెక్టర్ సూచించారు. రాజకీయ పార్టీలు ఎన్నికల నిర్వహణకు పోలింగ్ బూతులు, ఓటరు జాబితాలో ఏదైనా సమస్యలు ఉంటే సూచించాలని వాటిని పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. ఓటరు జాబితాలో నూతన ఓటరు నమోదు, తప్పుల సవరణ, ఓటర్ తొలగింపు తదితర అంశాలపై రాజకీయ పార్టీలకు పూర్తి అవగాహన అవసరమని ఆయన తెలిపారు. ఫామ్ 6 దరఖాస్తు ద్వారా నూతనంగా

మిగతా 2 లో...

## జిల్లాలో పర్యటించనున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు

(మొదటి పేజీ తరువాయి...)

ప్రాజెక్ట్ ను సందర్శించి చంద్రుకుంట గ్రామంలోని గిరిజనులకు సంబందించిన పోడు భూములను పరిశీలించి వారితో సమావేశం అవుతారన్నారు. అదే సాయంత్రం అశ్వారావుపేట మండలం చేరుకొని పెదవాగు ప్రాజెక్టును సందర్శించి అశ్వారావుపేటలో రాత్రి బస చేస్తారన్నారు. 18వ తేదీ ఉదయం పండువారి గూడెం, గాండ్లగూడెం, కావడిగుండ్ల తదితర గ్రామాలలోని వివిధ గిరిజన సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి అనంతరం గిరిజన సంక్షేమశాఖ వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలలను సందర్శిస్తారన్నారు ఈ కార్యక్రమాలలో సంబంధిత తహసిల్దారులు, ఇరిగేషన్ అధికారులు, ఐటీడీఏ అధికారులు, తప్పనిసరిగా పాల్గొనాలని తెలిపారు.

## దొంగల హవా...

(మొదటి పేజీ తరువాయి...)

దొంగలు కాపర్ ట్రాన్స్ఫార్మర్, బోరు మోటర్ల దొంగతనాలు, మూకుమ్మడిగా దొంగతనాలు ఆరబయట నివాస గృహాలు, వ్యాపార సంస్థలను లక్ష్యంగా ఎంచుకొని తమ మార్గానికి పదును పెడుతున్నరు. కాగా శుక్రవారం అర్ధరాత్రి ప్రధాన రహదారిపై సితార రెస్టారెంట్ నందు వెనుక వైపు తాళం పగలగొట్టి దొంగలు రెస్టారెంట్ లోని ఫర్నిచర్ ను ధ్వంసం చేసి హల్చల్ చేశారు. షాపులోని వివిధ వస్తువులను క్రిందపడివేసి షాపులో కౌంటర్లోని నగదును అపహరించుకొని పోయారు. మరోవైపు షాపులోని వంట కోసం వాడే సామగ్రిని, మసాలాలను, నూనె డబ్బాలను, బాస్మతి బియ్యమును దొంగలు దోసుకున్నారు. ఉదయం రెస్టారెంట్ రాగానే రెస్టారెంట్లో ఫర్నిచర్ ను చూసి యజమానులు కంగు తిన్నారు. రెస్టారెంట్లో చోరీ జరిగిందని గ్రహించిన యజమానులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు వెంటనే స్పందించి, రెస్టారెంట్ నువ్వు సందర్శించి, ఘటన వివరాలను యజమానులు అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా యజమానులు మాట్లాడుతూ.. ప్రధాన రహదారిపై నిత్యం రద్దీగా ఉండే రెస్టారెంట్ లోని దొంగలు ఫర్నిచర్ ను, సొత్తును అపహరించారని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు.

# వనం విడిచి జనంలోకి..

- కాలం చెల్లిన సిద్ధాంతాలకు స్వస్తి
- సక్సెస్ అయిన ఆపరేషన్ చేయూత
- లొంగి పోయిన మావోయిస్టు సభ్యులకు ప్రభుత్వం చేయూత
- రూ 25 వేల చొప్పున పారితోషికం అందజేత
- భద్రాద్రి జిల్లా పోలీసుల సేవలు భేష్
- విలేకరుల సమావేశంలో మల్టీ జోన్ ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి.




**భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 15, ప్రజాజ్యోతి:** కాలం చెల్లిన సిద్ధాంతాలతో ఆయుధాలను పట్టుకుని అడవిబాట పట్టిన మావోయిస్టులు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న అనేక సంక్షేమ పథకాలు ఆదివాసీ ప్రజల అభివృద్ధిని ఆకాంక్షిస్తూ పోలీస్ శాఖ చేపట్టిన ఆపరేషన్ చేయూత భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎంతో విజయవంతం అయిందని, ఒకే సారి 64 మంది మావోయిస్టు సభ్యులు లొంగుబాటు కావడం జిల్లా పోలీసుల కృషి అభినందనీయమని, మల్టీ జోన్ ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, లక్ష్మీదేవిపల్లి మండలం, హేమచంద్రాపురంలో ఉన్న జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పలు అంశాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గత కొంతకాలంగా నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీ ఆదివాసీ ప్రజలలో ఆదరణ నమ్మకం కోల్పోయి కాలం చెల్లిన సిద్ధాంతాలతో పాటుగా ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిని అడ్డుకుంటూ అభివృద్ధి జరిగితే తమ మనుగడ ఉండదని, ఆదివాసీ అమాయక ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేశారన్నారు. ఇటీవల కాలంలో ఒక ఆదివాసీ మహిళా మావోయిస్టులు అమర్చిన మందు పాత్ర పేలి తమ కాలును కోల్పోవడం కూడా జరిగిందని, మావోయిస్టు పార్టీ నాయకుల దుశ్చర్యలకు ఆదివాసీ ప్రజల కనీస సౌకర్యాలు అందక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వనాన్ని విడిచి జన జీవన స్రవంతిలో గడిపేందుకు లొంగిపోయిన మావోలు సాధారణ జీవనం గడపాలనుకునే పార్టీ సభ్యులు, వారి కుటుంబ సభ్యులు, లేక స్వయంగా తమ దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్లో లొంగి పోయేందుకు జిల్లా ఉన్నతాధికారుల వద్ద సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. లొంగిపోయిన దళ సభ్యులకు ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలు కల్పించడమే కాకుండా జీవనోపాధి, పునరావాసాన్ని కల్పించడం కోసం ప్రభుత్వ పరంగా అందవలసిన అన్ని రకాల ప్రతిపాదనలను జిల్లా పోలీస్ యంత్రాంగం ఎల్లప్పుడు కృషి చేస్తుందన్నారు. ఇప్పటికైనా లొంగి పోయిన మావోయిస్టు సభ్యులకు ప్రభుత్వం కల్పించే పునరావాస సౌకర్యాలకు ఆకర్షితులై వివిధ క్యాడర్ లో ఉన్న వారు తమ ఆయుధాలను విడిచి పెట్టి పోలీసుల ఎదుట లొంగి పోవడం జరిగిందన్నారు. గడిచిన రెండున్నర నెలల కాలంలో వీరితో కలిపి 122 మంది నిషేధిత మావోయిస్టు పార్టీ సభ్యులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుల ఎదుట లొంగి పోవడం జరిగిందని, లొంగిపోయిన సభ్యులకు 25 వేల నగదు, పారితోషికంగా అందిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ సూచనల మేరకు వనాన్ని విడిచి జనంలోకి రావాలని, కాలం చెల్లిన సిద్ధాంతాలకు స్వస్తి పలకాలని కోరారు. ఈ విలేఖరుల సమావేశంలో జిల్లా ఎస్ పి రోహిత్ రాజు, భద్రాచలం ఏఎస్పీ విక్రాత్ కుమార్ సింగ్, సి.ఆర్.పి.ఎఫ్ కమాండెంట్ 141 బెటాలియన్ రీతేష్ ఠాకూర్, ప్రీత, 81 బెటాలియన్ సి.ఆర్.పి.ఎఫ్ కమాండెంట్ రాజేష్ డోగ్రా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణ పై రాజకీయ పార్టీ నాయకులతో సమీక్ష

**(మొదటి పేజీ తరువాయి...)** ఓటు హక్కు కొరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఫామ్ 7 ద్వారా తొలగింపు, అభ్యంతరాలు పై దరఖాస్తు చేసుకోవచ్చని, వచ్చిన దరఖాస్తులను బి ఎల్ వో లు విచారణ చేపట్టి, నోటీసులు జారీ చేసిన తర్వాత మాత్రమే తొలగింపు చేపడతామని కలెక్టర్ తెలిపారు. ఫామ్ 8 ద్వారా తప్పుల సవరణ, ఫోటో మార్పు, ఓట్ షిఫ్టింగ్ తదితర సేవలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా ఫామ్ 6,7 మరియు 8 లలో 19,514 దరఖాస్తులు రాగా అందులో 10944 దరఖాస్తులు పరిష్కరించబడ్డాయని, 1,310 దరఖాస్తులు తిరస్కరించబడ్డాయని అదేవిధంగా 7,260 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని కలెక్టర్ వివరించారు. ఓటర్లు నూతన ఓటు హక్కు రిజిస్ట్రేషన్, మార్పులు చేర్పులు తదితర సేవలకు ఎక్కడకు తిరిగే అవసరం లేకుండా బిఎల్ఓ యాప్ ద్వారా అన్ని సేవలు అందుబాటులో ఉన్నాయని, రాజకీయ పార్టీ నాయకులకు వచ్చే శనివారం బి ఎల్ ఓ యాప్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీ నాయకులు ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును రిజిస్ట్రేషన్ చేసుకునేలా చూడాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల సూపర్డెంట్ ధారా ప్రసాద్, నేషనల్ కాంగ్రెస్, బి ఆర్ యస్ , బిజెపి, సిపిఐ , సిపిఎం రాజకీయ పార్టీల అధ్యక్షులు, కార్యదర్శులు , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మామిడి పంటలపై అవసరమైన పరిశోధనలను చేయాలి

- డా. డి లక్ష్మినారాయణ, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ములుగు
- రైతులు పండిస్తున్న పంటలను పరిశీలించి సూచనలు అందించిన లక్ష్మీనారాయణ.







**అశ్వారావుపేట, మార్చి 15, ప్రజాజ్యోతి:** మామిడిపై అవసరమైన పరిశోధనలు చేయాలని శాస్త్రవేత్తలకు డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్. డి. లక్ష్మీనారాయణ సూచించారు. శనివారం నియోజకవర్గ కేంద్రంలోని కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చర్ యూనివర్సిటీ పరిధిలో ఉన్న ఉద్యాన పరిశోధన స్థానంలో నిర్వహించిన వేలంలో ఆయన పాల్గొన్నారు. ఈ వేలంలో కొబ్బరి రూ.7.55 లక్షలు, మామిడి రూ. 2 . 2 5 ల క్షలు, జీడిమామిడి రూ.50వేలు, సపోటా రూ.37 వేలు, పనస రూ.9వేల 5వందలకు పాటదారులు దక్కించుకున్నట్లుతెలియజేశారు. ముందుగా ఆయన పంటలలో అమలుపరుస్తున్న పరిశోధనలను పరిశీలించి శాస్త్రవేత్తలకు సూచనలు, సలహాలు అందించారు. అదేవిధంగా అల్లిగూడెం గ్రామంలో రైతులు పండిస్తున్న బూడిద గుమ్మడి, మిర్చి, మునగ పంటలను పరిశీలించిన లక్ష్మి నారాయణ మెరుగైన దిగుబడి సాధించేందుకు రైతులకు పలు మె లుకువలు తెలియజేశారు. లింగాలపల్లి గ్రామంలోని మామిడి తోటలను పరి శీలించి అవసరమైన మరిన్ని పరిశోధనలు చేయాలని స్థానిక శాస్త్రవేత్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సైంటిస్ట్, హెచ్ఆర్ఎస్ హెడ్ అశ్వారావుపేట డాక్టర్ విజయకృష్ణ, సైంటిస్ట్, హెడ్ జె వి ఆర్ హెచ్ ఆర్ ఎస్ మల్యాల కె నాగరాజు, పలువురు కార్యాలయ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యపు పోస్టల్ శాఖ

(మొదటి పేజీ తరువాయి...)

పోస్టల్ శాఖ వారి నిర్వాకంలా మారింది. చర్ల మండలంలోని అటవీ గ్రామమైన తిమ్మిరి గూడెం అటవీ ప్రాంతంలో ఒకచోట కుప్పగా వడవేసిన వందల సంఖ్యలో ఆధార్, ఓటర్ గుర్తింపు, పాన్ కార్డులు వీటితోపాటు కోర్టు నుండి వచ్చిన పత్రాలు, జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి ప్రజలకు వచ్చిన ఉత్తరాలు అనేక రకాల ఉత్తరాలు గుట్టలు గుట్టలుగా పడేసి ఉన్నాయి పోలీసుల నుండి వాహనదారులకు వచ్చిన చలానులను సైతం సంబంధిత వ్యక్తులకు చేరకుండా నిర్లక్ష్యం వహించి అటవీ ప్రాంతంలో పడవేసిన పోస్టల్ సిబ్బంది పనితీరును చూసి ప్రజలు ముక్కున వేలు వేసుకుంటున్నారు.

### ▪ ఏ ఎస్ పి వివరణ

చర్ల మండలంలో శనివారం నాడు సత్యనారాయణపురం పోస్టల్ శాఖలో జరిగినటువంటి సంఘటనపై ఆ శాఖ ఏఎస్పీని (అసిస్టెంట్ సూపర్డెంట్ పోస్ట్ ఆఫీస్) ప్రజా జ్యోతి వివరణ కోరగా అడవిలో పడవ వేసిన పోస్టల్ శాఖకు చెందిన అనేక రకాల కార్డులు ఉత్తరాలు 2023వ సంవత్సరానికి చెందినవిగా, అప్పటికి తాను చెర్లలో చార్జి తీసుకోలేదంటూ, 2023వ సంవత్సరంలో ఆ గ్రామాల మధ్య పని చేసినటువంటి అధికారులు ఏ స్థాయి అధికారినైనా ఉపేక్షించేది లేదని, దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి, శిక్షించేలా వ్యవహరిస్తానని ప్రజా జ్యోతికి తెలిపారు.



# ఇంకుడు గుంటల నిర్మాణం చేపట్టాలి



**ఇల్లందు, మార్చి 15, ప్రజాజ్యోతి :** జలశక్తి అభియాన్ పథకం ద్వారా అతి తక్కువ ఖర్చుతో ఇంకుడు గుంటల నిర్మాణం చేపట్టాలని మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిని, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన సూచించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇంకుడు గుంటలను మొదట పబ్లిక్ స్థలాలు, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలలో చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడి లేకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక రిజిస్టర్ ను ఏర్పాటు చేసి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నమోదు చేసి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి పన్నుల వసూళ్లను మరింత వేగవంతం చేయాలని, ప్రస్తుతానికి 70 శాతం మాత్రమే పన్నులు వసూలు చేయడం జరిగిందని తెలిపారు. మిగిలిన 30 శాతం పన్నులను 10 రోజుల్లో పూర్తి చేయాలని చించారు. ఇల్లందు మున్సిపల్ పరిధిలోని ప్రజలు ఇంటి పన్ను0లను సకాలంలో చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్. శ్రీకాంత్, ఇంజనీరింగ్ అధికారులు, మేనేజర్ అంకుషావలి, ఏఓ శ్రీనివాస్ రెడ్డి, ఆర్ఐ శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తమ పాఠశాలగా ఎంపిపిఎస్ ముత్తారపు కట్ట



**ఇల్లందు, మార్చి 15, ప్రజాజ్యోతి:** మండలంలో ఉత్తమ పాఠశాలగా ఎంపిపిఎస్ ముత్తారపుకట్ట ఎంపికైనట్లు శనివారం మండల విద్యా వనరుల కేంద్రంలో (యంఆర్సి) సమావేశంలో యంఈఓ టివిఆర్ఎస్ స్వామి ప్రకటించారు. మండలంలోని కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయులు సభ్యులుగా ఏర్పాటు చేసిన ఎంపిక కమిటీ యంపిపిఎస్ ముత్తారపుకట్ట పాఠశాలను ఇల్లందు మండలంలో ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేసి, జిల్లా స్థాయి ఎంపిక కోసం జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపారన్నారు. ఇటీవల కాలంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మండలంలో వివిధ పాఠశాలలను సందర్శించిన నేపథ్యంలో జిల్లా అధికారులు నిర్ణయించిన 7 అంశాలను పరిగణన లోకి తీసుకుని వివిధ పాఠశాలలను సందర్శించడం జరిగిందని పేర్కొన్నారు. పాఠశాల సందర్శన సందర్భంలో పరిశీలించిన 7 అంశాల ఆధారంగా ఉత్తమ పాఠశాలగా యంపిపిఎస్ ముత్తారపుకట్టను ప్రకటించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లలిత, వివిధ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎఫ్ఎల్ఎన్ బాలమేళా ఆర్పిలు ముత్తారపు కట్ట పాఠశాల ప్రధానోపాధ్యాయులు కబ్బాకుల రవి, ఉపాధ్యాయులు ఆరెం రవి కుమార్ లను అభినందించారు.

## పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలి



**భద్రాచలం టౌన్, మార్చి 15, ప్రజా జ్యోతి:** స్థానిక గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో ఉన్న హై స్కూల్ లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్, పెన్సిల్, ఎరేజర్, పౌచ్ టిఎన్జీవోస్ ప్రెసిడెంట్ డెక్క నరసింహా రావు సెక్రెటరీ గగ్గూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు ఎందరో విద్యార్థులు గవర్నమెంట్ స్కూల్లో చదువుకునే పెద్ద ఆఫీసర్లు అయ్యారని, అటువంటి వారందరినీ ఆదర్శంగా తీసుకొని మీ భవిష్యత్తుని విద్య ద్వారా బంగారు భవిష్యత్తుగా తీర్చిదిద్దుకోవలసిన బాధ్యత మీ మీదే ఉన్నదని తెలిపారు. రాబోయే పదవ తరగతి పరీక్షలందు అత్యధికమైన మార్కులుతో ఉత్తీర్ణులు అవ్వాలని తెలుపుతూ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు పద్మ టీఎన్జీ వోస్ భద్రాచలం వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ పడిగ నరసింహారావు, సోషల్ వెల్ఫేర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పసుమర్తి అపర్ణ, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సాదిక్ పాషా, శ్రీనివాస్, సీతారాములు, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జోసెఫ్ సేవలు మరువలేనివి

- సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా.



**ఇల్లందు, మార్చి 15, ప్రజాజ్యోతి:** సిపిఐ పార్టీ నాయకుడు కొత్తూరు జోసఫ్ (80) సిపిఐ పార్టీకి అందించిన సేవలు మరువలేమని సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా అన్నారు. శనివారం ఇల్లందు పట్టణంలోని 3వ వార్డుకు చెందిన కొత్తూరు జోసెఫ్ శుక్రవారం రాత్రి మృతి చెందాడని విషయం తెలుసుకున్న సిపిఐ పార్టీ శ్రేణులు ఆయన పార్థివదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ భాష, ఏఐటియుసి కేంద్ర కమిటీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె. సారయ్యలు మాట్లాడుతూ కొత్తూరు జోసెఫ్ 30 సంవత్సరాలు సింగరేణి ఉద్యోగిగా పనిచేసి, ఏఐటీయూసీ డెలిగేట్ గా ఉండి కార్మికుల సంక్షేమ కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. సింగరేణి కాలరీస్ లో గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటియుసి గెలుపుకు విశేష సేవలు అందించారని పేర్కొన్నారు. కొత్తూరు జోసెఫ్ కుమారుడు సుధాకర్ కొత్తగూడెం సిపిఐ కార్యాలయ కార్యదర్శిగా, కొత్తగూడెం ప్రజాపక్షం రిపోర్టర్ గా సిపిఐ పార్టీకి విస్తృత సేవలు అందిస్తున్నారన్నారు. ఆయన మరణం సిపిఐ పార్టీకి తీరని లోటని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏఐటీయూసీ ప్రెసిడెంట్ జమలయ్య, సిపిఐ జిల్లా నాయకులు నాగయ్య, దేవరకొండ శంకర్, కమటం చంద్రకళ, ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ యండి. నజీర్ అహ్మద్, సుజాతనగర్ మండల కార్యదర్శి హనుమంతరావు, సిపిఐ మాజీ కౌన్సిలర్లు ఊట్ల శ్రీనివాస్, ధర్మరాజు, యూసఫ్, కుమ్మరి రవీందర్ పాల్గొన్నారు.

## నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తిచేసి నిరుపేదలకు ఇవ్వాలి

- అల్లాడి పాల్ రాజ్ డిమాండ్.



**భద్రాచలం టౌన్, మర్చి 15, ప్రజాజ్యోతి :** భద్రాచలం పట్టణంలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇందిరమ్మ పథకం కింద పూర్తి చేసి అర్హులైన నిరుపేదలకు ఇవ్వాలని మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి పాల్ రాజ్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఏఎంసీ కాలనీలో నిర్వహించిన మాల మహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల మీద మాల మహానాడు ఎప్పుడు పోరాటం చేస్తుందని, ప్రతి పేద కుటుంబానికి భూమి, విద్య, ఉద్యోగం, కలిగి ఉండాలని అది రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని ఆయన తెలియజేశారు. గత ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనార్టీలకి న్యాయం జరుగుతుందని అనుకుంటే అన్యాయం జరిగిందని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని అనుకుంటే ఆశ నిరాశగా మిగిలిందని ఆవేదన వ్యక్తపరిచారు. భద్రాచల పట్టణంలో సొంత ఇల్లు లేక అనేకమంది నిరుపేదలు దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తున్నారని, భద్రాచల పట్టణంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఇందిరమ్మ ఇల్లులుగా కేటాయించి నిరుపేదలకు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అద్దె ఇళ్లలో ఉంటూ రోజువారి కూలికి వెళ్తూ దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తున్నారని, కరెంటు చార్జీలు కట్టలేక ఇంటి అద్దెలు కట్టలేక సతమతం అవుతున్నారని అన్నారు. భారతదేశం స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్న ప్రజలు మరింత పేదలగానే మిగిలిపోతున్నారని, ప్రభుత్వాలు మారిన, పేదల బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ కలలు సహకారం చేయాలనుకుంటే ముందుగా అర్హులైన పేదలకు సొంతింటి కలను నెరవేర్చి చూపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గుంట.కిషోర్, నాని, గుండు.జిమ్మీ, కిట్టు , మింటు, ఏసుబాబు, శాంతి రాజు, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ పార్లమెంటు సభ్యులు నామా నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు



**కొత్తగూడెం, మార్చి 15, ప్రజాజ్యోతి :** బీఆర్ఎస్ ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు నామా నాగేశ్వరరావు జన్మదినం సందర్భంగా కొట్టి వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ శేషాద్రి వినోద్ కుమార్, మైనార్టీ అధ్యక్షులు ఎగ్బాల్ పాషా , ఎస్సీ సెల్ అధ్యక్షులు తుంపిరి ప్రసాద్ , మాజీ సర్పంచులు కోరం చంద్రశేఖర్ , తాడూరి రజాక్ , మాజీ వార్డ్ సభ్యులు శ్రీకాంత్ నాయక్ , మెరుపు రమేష్, ఎర్రబడి శ్రీను , చిన్న, గోనె సురేష్, కోట రాంబాబు , రసూల్ , బిఆర్ఎస్ నాయకులు తాండ్ర నాగా బాబు , టీ టైప్ మున్నీర్ , అజ్మీరా విజయ్ కుమార్ , తంబాల శ్రీనివాస్ , జి. శివ తదితరులు పాల్గొన్నారు .

## గిరిజనులకు ఎలక్ట్రికల్ కుక్కర్ వినియోగించడం పై అవగాహన కల్పించిన కలెక్టర్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 15 ప్రజాజ్యోతి :** దమ్మపేట మం డలం పూసుకుంట గ్రామంలో గిరిజనులకు ఎలక్ట్రికల్ కుక్కర్ వినియోగంపై కలెక్టర్ శనివారం అవగాహన కల్పించారు. గిరిజనులకు ఎలక్ట్రికల్ కుక్కర్ ఉపయోగించడంపై అవగాహన కల్పించడంలో భాగంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్వయంగా కుక్కర్ పై వంట చేసి ఏ విధంగా సులువుగా వంట చేసుకోవచ్చు గిరిజనులకు చూపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరిజన మహిళలతో ముచ్చటించారు. ఎలక్ట్రికల్ కుక్కర్ ఉపయోగించి వంట ను సులభంగా తయారు చేయవచ్చని, మారుతున్న కాలానికి అనుగుణంగా అందుబాటులో ఉన్న అన్ని సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని గిరిజనులు అభివృద్ధి చెందాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో పూసుకుంట గిరిజన మహిళలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసి పూజలు



**భద్రాచలం, మార్చి 15, ప్రజాజ్యోతి:** భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామివారి ఉత్సవమూర్తులకు శనివారం అర్చకులు స్వర్ణతులసి పూజలు జరిపారు. తెల్లవారుజామున సుప్రబాతం పలికి ఆరాధన, అరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు చేశారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణమూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

**అన్నదానానికి వితరణ..** భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో అన్నదానానికి ఏపీలోని కృష్ణా జిల్లా కానూరుకు చెందిన చంద్రశేఖర్, సౌజన్య దంపతులు శనివారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ అధికారి సాయిబాబాకు అందజేయగా అనంతరం స్వామివారికి పూజలు నిర్వహించారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి సస్పెన్షన్ ఎత్తివేయాలి

- **బీఆర్ఎస్ నాయకుల నిరసన, అంబేద్కర్ విగ్రహానికి వినతి.**




**భద్రాచలం, మార్చి 15, ప్రజాజ్యోతి:** శాసనసభలో బీఆర్ఎస్ సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీమంత్రి జగదీశ్ రెడ్డి పైసస్పెషన్ ఎత్తివేయాలని భద్రాచలం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు అనంతరం అంబేద్కర్ సెంటర్ లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఆకోజు సునీల్ కుమార్ మాట్లాడుతూ శాసనసభ స్పీకర్ మీద ఎలాంటి ఆరోపణలు జగదీష్ రెడ్డి చేయలేదని, స్పీకర్ పై బీఆర్ఎస్ పార్టీకి ఎనలేని గౌరవం ఉందని, కావాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సస్పెండ్ చేయించారని, శాసనసభ విధానాలకు అనుగుణంగా మాట్లాడే సీనియర్ నాయకుడు జగదీష్ రెడ్డి అని ఆయనపై వెంటనే సస్పెన్షన్ ఎత్తివేయాలన్నారు. శాసనసభలో ప్రభుత్వ వైఫల్యాలు, ప్రభుత్వ విధానాలు ఎండగడుతూ ప్రజాసమస్యలపై గళమెత్తుతున్న జగదీష్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేయడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో మండల కో-కన్వీనర్ రేపాక పూర్ణచంద్రావు, మండల నాయకులు అయినాల రామకృష్ణ. కాపుల సూరిబాబు, తూతిక ప్రకాష్, అంబటికర్ర కృష్ణ, నానిపల్లి శ్రీను, బాసిపోయిన మోహన్రావు, రావూరి రవికిరణ్, బద్ది బాబి, ఇమంది నాగేశ్వరరావు, మురాల డానియేల్, ప్రదీప్, మహిళా నాయకురాలు కావూరి సీతామహాలక్ష్మి పూజల లక్ష్మి, తెల్లం రాణి, గంపల రవికుమారి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిపో ఉద్యోగులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ




**భద్రాచలం, మార్చి 15, ప్రజాజ్యోతి:** భద్రాచలం ఆర్టీసీ డిపోలో ఉద్యోగులకు ఎండతీవ్రత దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ డీఎం తిరుపతి శనివారం మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ప్రతిరోజూ ఉదయం 11.30 నుంచి డిపో గేటువద్ద మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని డిపో ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఎండతీవ్రత దృష్ట్యా తగిన జాగ్రత్తలు పాటించి విధులు నిర్వహించాలన్నారు.

# విద్యార్థులు కలను సాకారం చేసుకోవాలి

- **ఎంఈఓ జగన్.**



**టేకులపల్లి, మార్చి 15, ప్రజాజ్యోతి:** తల్లిదండ్రులు బాల్యం నుంచే పిల్లల భవిష్యత్తు గురించి కలలు కంటూ ఉంటారు అని , ఆ కలలను సాకారం చేయాల్సిన పిల్లలపై ఉంటుందని మండల విద్యాశాఖ అధికారి జగన్ అన్నారు. శనివారం బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగిన పేరెంట్స్,టీచర్స్ సమావేశంలో ఎన్నో రీతుల్లో పిల్లలు తమ భవిష్యత్తు కలలను సాకారం చేసుకునే ఆలోచనల ను ఆచరణ సాధ్యం చేస్తూ, వారు ఏమి కావాలనుకుంటున్నారో ఆ ఫ్యాన్సీ డ్రస్సులను ధరించి సమావేశానికి హాజరయ్యారు. తల్లిదండ్రుల సమక్షంలో పిల్లలు తమ భవిష్యత్తు గురించి ఫ్యాన్సీ డ్రెస్సులు ధరించి చెప్పుకున్నారు. డాక్టర్లుగా, కలెక్టర్ లుగా, టీచర్స్ గా, రైతులుగా, పోలీస్ లుగా వివిధ రంగాల్లో స్థిరపడి సమాజానికి సేవ చేస్తాము అనీ విద్యార్థులు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎం ఈఓ జగన్ హాజరై ఈ వారు మాట్లాడుతూ తాను కూడా జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని, ఉన్నత విద్యను అభ్యసించానని, ఎంతో కష్టపడి ఉన్నత చదువులు చదివి ఈరోజు ఈ స్థాయిలో వున్నాను అని వారు అన్నారు. పిల్లల ఆశలకు ఆశయాలకు అను గు ణంగా తల్లిదండ్రులు వారికి అండగా నిలిచి, ఎలాంటి లోటుపాట్లు లేకుండా వారిని ముందుకు నడిపించాలని సూచించారు. అప్పుడే సమాజంలో ఉత్తమ పౌరులు తయారవుతారు అన్నారు. ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ హారిక, ప్రముఖ న్యాయవాది అడపాల మహాలక్ష్మి, టేకులపల్లి పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సుధా కర్, కాని స్టేబుల్ భాస్కర్, బొమ్మనపల్లికి చెందిన ప్రముఖ రైతు నారందాసు బిక్షమ య్య లు తమ స్వీయ అనుభవాలను, తాము జీవితంలో ఎదుర్కొన్న ఆటు పోట్లు, అయినప్పటికీ వాళ్ళు ఆయా, రంగాల్లో స్థిరపడిన తీరు తీరుతెన్నులను పిల్లలకు తల్లిదండ్రులకు విశదీకరించారు. హెచ్.ఎం, ఎం.జ్యోతిరాణి సారధ్యంలో విద్యార్థులు వివిధ అంశాలలో కనబరిచిన ప్రతిభకు గుర్తుగా సర్టిఫికెట్ లు బహుమతులను విద్యార్థులకు వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్పర్సన్ పొగాకు లక్ష్మి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ ఎం గీలాల్, టీచర్స్ జర్పల పద్మ, నీరజ షారోన్, సీఆర్పీ అబ్బయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్ గా ఇర్పా శ్రీనివాసరావు

- **ప్రమాణ స్వీకారానికి భారీగా కదిలిన కాంగ్రెస్ కార్యకర్తలు**
- **మార్కెట్ కమిటీ ఆఫీసులో వేడుక నిర్వహించిన కాంగ్రెస్ పెద్దలు .**



**చర్ల, మార్చి 15, ప్రజాజ్యోతి :** నూగూరు, చర్ల మండలాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా ఇర్పా శ్రీనివాసరావు ప్రమాణ స్వీకరణ శనివారం నాడు చర్ల మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆఫీస్ ఆవరణలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, పొదెం వీరయ్య పాల్గొన్నారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని నిర్దేశించిన సమయానికి వేద మంత్రోచ్చారణల మధ్య జిల్లా మార్కెటింగ్ అధికారి జే నరేందర్ తో నూతన మార్కెట్ కమిటీ, అధ్యక్షులు ఉపాధ్యక్షులు మరియు డైరెక్టర్ల చేత ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం చేపట్టి, తదనంతరం కాంగ్రెస్ సీనియర్ నాయకులు చీమలమర్రి మురళి అధ్యక్షతన జరిగిన సభా కార్యక్రమంలో పలువురు వక్తలు ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పొదెం వీరయ్య మాట్లాడుతూ మండలాల్లో రైతులు దళారుల చేత మోసగింపబడుతున్నారని, ముఖ్యంగా పత్తి కొనుగోళ్లలో సీసీఐకి చేరవలసినటువంటి పత్తిని దళారులు కాంట మోసాలతో రైతులు దగాలు పడేలాగా వ్యవహరిస్తున్నారని ఇటువంటి రైతు సమస్యలను నూతన కమిటీ ఎదుర్కొని రైతులకు అండదండగా నూతన కమిటీ ఉండాలని ఆయన నూతన కమిటీకి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ కాంగ్రెస్ నాయకులు చింతిరాల రవికుమార్, పీసీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎర్రంకి బాబ్జి, తడికల లాలయ్య, బండారు రామకృష్ణ, కడెం సత్యనారాయణ, ఇందల రమేష్, ఇందల బుచ్చిబాబు, చర్ల పిఎసిఎస్ చైర్మన్ పరుచూరి రవిబాబు చర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఆవుల విజయభాస్కర్ రెడ్డి, ఆవుల పుల్లారావు, చర్ల మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు కారంపూడి సాల్మన్ రాజు, తోటమల్ల వరప్రసాద్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జెకెఓసి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలి

- **ప్రైవేటీకరణ వద్దు, సింగరేణి నే ముద్దు అని ఎఐటియుసి పిలుపు.**




**టేకులపల్లి, మార్చి 15, ప్రజాజ్యోతి:** ఇల్లందు ఏరియా జెకెఓసి ఉదయం షిఫ్ట్ నందు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బానోత్ బాలాజీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె .సారయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎండీ నజీర్ అహ్మద్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటీకరణ వద్దు, సింగరేణి అనే ముద్దు అని వారు అన్నారు. అయితే ఇల్లందు ఏరియా మనుగడకు ఐఖ్య పోరాటాలు అవసరమని జెకెఓసి విస్తరణ ప్రాజెక్టు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐఖ్య ఉద్యమాలు అవసరమని అందుకు ఎఐటియుసి కార్యాచరణకు పూనుకుంటుందని వారు తెలిపారు. రాజకీయ జోక్యం వలన సింగరేణి పరిస్థితి ఆగమ్యగొచరంగా మారిందని గత బిఆర్ఎస్ పద్దతిలో కాంగ్రెస్ నడుస్తోంది అని డిఎంఎఫ్, సిఎస్ఆర్ తదితర నిధులు దుర్వినియోగం అవుచున్నాయని దుయ్యబట్టారు. యాజమాన్యం ఎమ్మెల్యే లకు లోకల్ లీడర్లుకు దాసోహం అంటున్నారు అని కోడా ఆఫ్ డిసిప్లెన్ మరిచారని గుర్తింపు, ప్రాతినిధ్యం సంఘాల తొ చర్చించకుండా వ్యవహరిస్తోంది అని అన్నారు ఈనెల 7,8 తేదీలలో సి&ఎండి స్థాయిలో జరిగిన మీటింగ్ నందు ఉద్యోగుల సంక్షేమంలొ భాగంగా సొంత ఇంటి పథకం, వడ్డీ లేని రుణం, కార్పొరేట్ స్థాయి వైద్య సదుపాయాలు, ఎన్-1 ప్లేడే పద్దతి ఎత్తి వేయాలని, ప్రస్తుతం వున్న జనరల్ మజ్దూర్, బదిలీ వర్కర్ల పేర్లను మార్చి జనరల్ అసిస్టెంట్ గా చేయాలని, పేరేక్స్ పై ఇంకంటాక్స్ కోలిండియా మాదిరిగా సింగరేణి కార్మికులకు రీఅంబర్స్మెంట్ చేయాలని తదితర అంశాలపై యాజమాన్యంతొ పూర్తి స్థాయిలో మాట్లాడడం జరిగింది. అందుకు యాజమాన్యం సానుకూలంగా స్పందించి త్వరలో పరిష్కరిస్తామని అన్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షులు దాసరి రాజారాం, కెఓసి ఫిట్ సహాయ కార్యదర్శులు షెక్ సర్వర్, బానొత్ బాలాజీ, షిఫ్ట్ ఇంచార్జిలు సద్దాత్ హుస్సేన్, కరుణ శంకర్, సామల శ్రీనివాస్, శ్యామ్ సుందర్, బాలుకుమార్, రాజ్ కుమార్, షేక్ ఇబ్రహీం, బండి సీతారాములు, కనకరాజు, వేంకటనర్సయ్య, ఉమేష్ కుమార్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.